# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-04-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో పర్యటిస్తున్న 16వ ఆర్థిక సంఘం సభ్యులు ఈ రోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశమయ్యారు.**
2. **ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధ్యాన్యతనిస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ అన్నారు.**
3. **రాష్ట్రంలో ఖాళీ అయిన రాజ్యసభ స్థానంలో ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది.**
4. **రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పే వారికి ప్రోత్సాహం అందించేలా చర్యలు తీసుకుంటామని ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**
5. **కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకొని రంగస్థల పురస్కారాలను అందజేయనున్నామని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు.**

==========================

రాష్ట్ర పర్యటనకు వచ్చిన పదహారవ ఆర్థిక సంఘం సభ్యులు ఈ రోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు వంటి అంశాలపై ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను ఆర్థిక సంఘం ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించారు. అనంతరం రాజధాని అంశం, కేంద్రం నుంచి రావలసిన నిధులు, ప్రత్యేక సాయం వంటి వాటిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి తెలియజేశారు.

--------------------------

ప్రజారోగ్యానికి ప్రాధ్యాన్యతనిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం 100 పడకల ఆసుపత్రులను నిర్మించనుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ అన్నారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం సేరి నరసన్నపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రైవేటు ఆసుపత్రిని మంత్రి ఈ రోజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

..వాయిస్... 32 సెకన్లు

--------------------------

రాష్ట్రంలో ఖాళీ అయిన రాజ్యసభ స్థానంలో ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 29వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరించనున్నారు. 30న నామినేషన్ల పరిశీలన చేపడతారు. మే 2 వరకు ఉపసంహరణకు గడువు ఇవ్వగా, మే 9న ఎన్నిక నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు. వైయస్సార్ కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులుగా ఉన్న విజయసాయిరెడ్డి రాజీనామాతో ఈ స్థానం ఖాళీ అయింది.

-----------------------------

రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పే వారికి ప్రోత్సాహం అందించేలా చర్యలు తీసుకుంటామని ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిన్న రాష్ట్ర ప్రభుత్వం భారత పరిశ్రమల సమాఖ్య –సిఐఐ మధ్య జరిగిన ఉమ్మడి సమావేశంలోఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పారిశ్రామికవేత్తలు పెట్టుబడులతో ముందుకు రావాలని, వారికి కావలసిన మౌలిక వసతులు కల్పిస్తామని అన్నారు. విశాఖపట్నాన్ని ఐటి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ఐటి రంగంలో ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని వెల్లడించారు.

-----------------------------

జల జీవన్ పథకం ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం బిజెపి కార్యాలయంలో పది లక్షల రూపాయల ప్రధానమంత్రి సహాయనిధి చెక్కులను కేంద్రమంత్రి లబ్ధిదారులకు నిన్న అందజేసారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ 29 సెకన్లు

-----------------------------

రాష్ట్రాన్ని ఏవియేషన్ హబ్ గా మారుస్తామని మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో విమాన రంగంలో పెట్టుబడులు కోసం వివిధ సంస్థల ప్రతినిధులతో ఆయన నిన్న సమావేశం అయ్యారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పెట్టు బడులు పెట్టేందుకు ముందుకు వచ్చేవారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఈవీ టోల్స్, డ్రోన్ తయారీ రంగాల్లో 15 వందల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు కొన్ని సంస్థలు ముందుకు వచ్చాయని మంత్రి వివరించారు.

-----------------------------

ప్రముఖ సంఘ సంస్కర్త, ఆధునిక సాహిత్య యుగ వైతాళికులు కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి ఈరోజు. 1848వ సంవత్సరం ఏప్రిల్ 16వ తేదీన రాజమహేంద్రవరంలో వీరేశలింగం జన్మించారు. ఆయన రాసిన ఆంధ్ర కవుల చరిత్ర, స్వీయ చరిత్ర బహుళ ప్రచారం పొందాయి. 1881 సంవత్సరంలో మొదటి వితంతు వివాహం జరిపించారు. 1919 సంవత్సరం మే 27వ తేదీన అప్పటి మద్రాసులో ఆయన పరమపదించారు. కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007 నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు నాటకరంగ దినోత్సవంగా నిర్వహిస్తోంది.

-----------------------------

కాగా.. కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతిని పురస్కరించుకొని రంగస్థల పురస్కారాలను అందజేయనున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. తెలుగు నాటక రంగ దినోత్సవం

సందర్భంగా రాష్ట్రస్థాయిలో ముగ్గురికి ప్రతిష్టాత్మక కందుకూరి రంగస్థల పురస్కారం, జిల్లా స్థాయిలో 107 మందికి కందుకూరి విశిష్ట పురస్కారాలను అందిస్తున్నామని చెప్పారు. విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఈ పురస్కారాలను ఈరోజు సాయంత్రం అందించనున్నామని తెలిపారు. కళా, నాటక రంగాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి వివరించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణకు రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మంత్రులు పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, వై. సత్య కుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్, పి నారాయణలు ఈ ఉపసంఘంలో సభ్యులుగా ఉంటారని తెలిపింది. వీరితో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి పాల్గొనే కార్యక్రమ వేదిక, భూమి పూజ, ఇతర ఏర్పాట్ల గురించి ముఖ్యమంత్రి ఈ సమావేశంలో సమీక్షించారు.

---------------------------

ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టును కేంద్ర నిపుణుల బృందం ఈరోజు నుంచి మూడ్రోజుల పాటు పరిశీలిస్తోంది. ఈ సందర్భంగా గ్యాప్-1, గ్యాప్-2, డయాఫ్రంవాల్ నిర్మాణాలకు వినియోగించనున్న మట్టి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం నాణ్యతా ప్రమాణాలను నిర్ధారించేందుకు, స్పిల్‌వే సమీపంలో ఉన్న మట్టి నిల్వల వద్ద ఈ బృందం నమూనాలను సేకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

---------------------------

బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహార ప్రాధాన్యాన్ని తెలిపేలా పోషణ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు.పోషన్ పక్వాడాలో భాగంగాజిల్లాలోని చీమకుర్తి మండల పరిధిలో పి.నాయుడు పాలెం గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రాన్ని కలెక్టర్ నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పోషకాహార ఆవశ్యత గురించి వివరించడంతో పాటు వారికి పోషకాహారాన్ని అందిస్తున్నామని ఆమె తెలియజేస్తూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

సత్వర న్యాయం పొందటానికి జాతీయ లోక్ అదాలత్ లు దోహదపడతాయని అనంతపురం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివ ప్రసాద్ యాదవ్ అన్నారు. అనంతపురంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, మే నెల 10వ తేదీన జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నామని అన్నారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని కోర్టులలో బెంచ్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కక్షిదారులకు రాజీ మార్గమే రాజమార్గమని, ప్రతి ఒక్కరూ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

---------------------------

ఉద్యోగాల కల్పనకు కేంద్రప్రభుత్వ స్టార్టప్ ఇండియా దోహదపడుతోందని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్థన్ రాజు అన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో సెట్విన్ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ స్టార్టప్ ఇండియా ద్వారా మెగా ఉద్యోగ మేళాను ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఈ మేళా ద్వారా 30 పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు లభించాయని చెప్పారు.

=====================